అన్నదాన ట్రస్టుకు రూ.10 వేల విరాళం



దాత హేమశంకర్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ప్రతినిధి

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టు కోసం ఆలయ పర్యవేక్షకులు బి.వీరభద్రరావుకు విశాఖపట్టణానికి చెందిన బొంతు హేమశంకర్ రూ.10 వేలు విరాళంగా ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆలయ మర్యాదలతో స్వామి వారి ప్రసాదం, శేష వస్త్రం, చిత్రపటం అందజేసి ఘనంగా సత్కరించారు.

నెలాఖరు వరకూ సెక్షన్-30 పొడిగింపు

అమలాపురం టౌన్: శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఇప్పటికే అమలాపురం డివిజన్‌లో అమలులో ఉన్న సెక్షన్-30 పోలీస్ యాక్ట్‌ను ఈ నెల 31వ తేదీ వరకూ పొడిగించినట్లు డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని అమలాపురం పట్టణం, అమలాపురం తాలూకా, అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం పోలీసుస్టేషన్ల పరిధిలో ఉన్న ప్రాంతాలకు ఈ సెక్షన్ వర్తిస్తుందని పేర్కొన్నారు. డివిజన్‌లో ఎవరూ ముందస్తు అనుమతులు లేకుండా బహిరంగ ప్రదేశాల్లో సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ప్రదర్శనలు, నిరసనలు, ధర్నాలు నిర్వహించకూడదన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న ఈ చర్యలకు సహకరించాలని డీఎస్పీ అంబికా ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

తాళ్లరేవు: రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేసినట్టేనని జి.వేమవరం సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు అన్నారు. ఆదివారం జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా జి.వేమవరంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో సుమారు 50 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కాకినాడ ప్రభుత్వాస్పత్రి మెడికల్ ఆఫీసర్ హరిబాబు రక్తదానం చేసిన యువకులను అభినందించారు. పుణ్యమంతుల సత్తిబాబు, తాతీలు, నారాయణమూర్తి పాల్గొన్నారు.

పార్కుకు వాటర్ డిస్పెన్సర్ బహూకరణ

అమలాపురం టౌన్: స్థానిక తామర చెరువు వద్ద గల డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యానవనానికి ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ రూ.40 వేల విలువైన వాటర్ డిస్పెన్సర్‌ను ఆదివారం బహూకరించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ వాటర్ డిస్పెన్సర్‌ను ప్రారంభించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులైన అల్లూరి రమేష్‌రాజు, మేడిచర్ల త్రిమూర్తులు, కొవ్వూరి వెంకటరెడ్డి, వీరా తాతాజీ, కొమ్మూరి వెంకట చల ప్రసాద్, బోణం సత్య వర ప్రసాద్‌ల ఆర్థిక సహకారంతో ఈ వాటర్ డిస్పెన్సర్‌ను సమకూర్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్తిబాబు, వార్డు కౌన్సిలర్ ఆశెట్టి నాగ దుర్గ తదితరులు పాల్గొన్నారు.



వాటర్ డిస్పెన్సర్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ అంబికా ప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి



ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత



నాగేశ్వరరావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ దుర్గాదేవి

ఐ.పోలవరం: ఐ.పోలవరం మండలం జి.వేమవరం పంచాయతీ చినకొడప గ్రామానికి చెందిన పింఛన్‌దారుడు తిరుకోటి నాగేశ్వరరావు అనారోగ్యం కారణంగా యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్ అందించాలన్న సంకల్పంతో వలంటీర్ కొండేపూడి దుర్గాదేవి ఆదివారం ఉదయం 6 గంటలకు యానాం ఆసుపత్రికి వెళ్లి బయోమెట్రిక్ తీసుకుని వృద్ధాప్య పింఛన్ రూ.2,750 నగదును నాగేశ్వరరావుకు అందజేశారు. దీంతో నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజా యుద్ధనౌక గద్దర్ సంచిక ఆవిష్కరణ

యానాం: 25వ ఓల్డేజ్‌హోమ్ రజతోత్సవ వేడుకల సభలో కవి సంధ్య ప్రజాయుద్ధ నౌక గద్దర్ సంచికను సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిసంధ్య వ్యవస్థాపకులు శిఖామణిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి అన్బరసు తదితరులు పాల్గొన్నారు.



























విగ్రహ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఐ.పోలవరం: ఎదుర్లంక వారధి వద్ద పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ నిర్మాణానికి పాతయింజరం గ్రామ వీరాంజనేయ అగ్నికుల క్షత్రియ సంఘ సభ్యులు ఆదివారం టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ విగ్రహ నిర్మాణం వేగంగా జరుగుతుందని, దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట సొసైటీ అధ్యక్షుడు పాలెపు బుజ్జి, సెక్రటరీ పోతాబత్తుల ఆదినారాయణ, సత్యనారాయణ, సీతయ్య ఉన్నారు.









మానవాళి నడవడికను నిర్దేశించేదే స్మార్త విద్య


విద్వత్సభలో స్మార్త, ఆగమ, అపర విద్యపై ఉపన్యసిస్తున్న వేద పండితులు

అమలాపురం టౌన్: మానవాళి నడవడికను నిర్దేశించేదే స్మార్త విద్య అని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మావుళ్లమ్మ దేవస్థానం ఆస్థాన విద్వాంసుడు యావని వేంకట రాయచంద్ర సోమయాజి ఘనాపాఠి అన్నారు. శ్రీకోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కూచిమంచి అగ్రహారంలోని శ్రీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం జరిగిన స్మార్తాగమ అపర విద్వత్సభకు సోమయాజి ఘనాపాఠి అధ్యక్షత వహించి ఉపన్యసించారు. ఈ సభలో స్మార్త, ఆగమ, అపర విద్యలపై ఘనాపాఠీలు చర్చించారు. సభకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి 150 మంది వరకూ స్మార్త పండితులు, పురోహితులు హాజరయ్యారు. అన్ని విద్యలకు వేదం మూలమని, వేదానికి ముడిపడే స్మార్త, ఆగమ, అపర విద్యలు ఉన్నాయన్నారు. పుట్టిన ప్రతి మనవుడిని ఉద్ధరించడానికి చేయాల్సిన 16 కర్మలు ఆపస్తంభుడు సూత్రాలకు అనుగుణంగా జరుగుతాయని వివరించారు. సమాజమంతా పురోహితునికి రుణపడి ఉంటుందన్నారు. సమాజాన్ని ఉద్ధరిస్తూ భావితరాల పిల్లలకు విద్యతో పాటు సంస్కారాన్ని కూడా పూర్తిగా నేర్పాలన్నారు. ఈ బాధ్యత పురోహితులు, తల్లిదండ్రులపై ఉందని స్పష్టం చేశారు. వేదస్మార్త పండితులు కర్రా భాస్కరావధానులు, అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితతావధానులు ఉపన్యసించి స్మార్త విద్యలో ఉన్న విశిష్టతను వివరించారు. శ్రీకోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ అధ్యక్షుడు గుళ్లపల్లి ప్రభాకర ఫణిరాజా, కార్యదర్శి గుళ్లపల్లి వెంకట్రామ్, కోశాధికారి యేడిది సుబ్రహ్మణ్యశర్మల పర్యవేక్షణలో ఈ సభ జరిగింది. అనంతరం స్మార్త పండితులను ఘనంగా సత్కరించారు. తర్వాత జరిగిన వేదస్వస్తితో అమలాపురం పట్టణం పావనమైంది. తెలుగు పండితుడు మండలీక ఆదినారాయణతో పాటు వేద, స్మార్త అభిమానులు పాల్గొన్నారు.





తీగలకు రాజకీయ అడ్డగింతలు

- మెరుగైన విద్యుత్తు సరఫరాకు సర్కారు యత్నం
- భూములివ్వని ప్రతిపక్ష మద్దతుదారులు
- ఉమ్మడి మూడు జిల్లాలకు కష్టకాలం
- ఉన్నతాధికారుల ఉదాసీనతే కారణం



సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: ఏటేటా పెరుగుతున్న అవసరాలు, వినియోగానికి తగినట్లు విద్యుత్ పంపిణీకి మెరుగైన ఏర్పాట్లు చేయడంలో గత టీడీపీ ప్రభుత్వం విఫలమైంది. ముందస్తు ప్రణాళికలను రూపొందించుకుని అమలు చేయకపోవడంతో వినియోగదారులకు ఇక్కట్లు తప్పలేదు. విద్యుత్ సరఫరాలో నిరంతర అవాంతరాలతో ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన లక్షలాది మంది వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. తక్షణ ఇబ్బందులను తొలగించడంతో పాటు భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రెండేళ్ల కిందటే చర్యలను చేపట్టింది. అయితే ఈ పనులు పూర్తయి విద్యుత్తు సరఫరా సక్రమంగా జరిగితే వినియోగదారుల నుంచి ప్రభుత్వానికి సానుకూలత ఏర్పడుతుందనే భావనతో ఆ గ్రామాల్లో పెద్ద రైతులుగా చలామణి అవుతున్న పలువురు పక్కా ప్రణాళిక ప్రకారం సహాయ నిరాకరణను కొనసాగిస్తున్నారు. తమతో పాటు భూములు ఇవ్వకుండా ఇతర రైతులను కూడా ఉసిగొల్పుతున్నారని సంబంధిత ఉన్నతాధికారులకు నిర్దిష్టమైన సమాచారం ఉంది. ఇలా చేస్తున్న వారిలో ప్రతిపక్ష పార్టీకి అనుకూలురైన వారున్నారని తెలుస్తోంది.

400 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణంతో పాటు..

ఉమ్మడి కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లో అవాంతరాలు లేని విద్యుత్తు సరఫరాకు వీలుగా కృష్ణా జిల్లా యలమర్రు వద్ద 400 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణంతో పాటు అందుకు అవసరమైన ఫీడర్, లైన్ల నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించింది. ఎంఈఐఎల్ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుని పనులు చేపట్టింది. గన్నవరం, గుడివాడ, పామర్రు నియోజకవర్గాల పరిధిలోని బాపులపాడు, తేలప్రోలు, ఉంగుటూరు, ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు, ముక్కపాడు, వింజరంపాడు, వెంట్రప్రగడ, చినపారుపూడి, పెదపారుపూడి మీదుగా యలమర్రుకు 400 కేవీ విద్యుత్తు లైను వెళ్లవలసి ఉంది.

రాజకీయ దురుద్దేశంతో..

విద్యుత్తు లైను నిర్మాణం జరగాలంటే నిర్దేశిత మార్గంలోని భూమి నిర్మాణ సంస్థకు అందుబాటులో ఉండాలి. పనులకు అడ్డంకులు తలెత్తకూడదు. కానీ పై గ్రామాల పరిధిలోని రైతులు ప్రతిపక్ష పార్టీకి అనుకూలురైన పలువురు ఉద్దేశపూర్వకంగానే మోకాలడ్డుతున్నారు. మూడు జిల్లాల పరిధిలోని లక్షలాది మంది విద్యుత్తు వినియోగదారుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నానికి సహాయ నిరాకరణ చేస్తున్నారు.

ఉన్నతాధికారుల జోక్యం అవసరం

విద్యుత్ లైను నిర్మాణం త్వరితగతిన సాగాలన్నా, మూడు జిల్లాల వినియోగదారులకు విద్యుత్తు కష్టాలు తీరాలన్నా రెవెన్యూ, ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరముంది. ఇప్పటికైనా అధికారులు సంబంధిత నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల సహకారంతోనైనా సమస్యను పరిష్కరించే ప్రయత్నాలు చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పోలవరం కుడి కాలువ తవ్వకం సమయంలో...

రాష్ట్రానికి వరప్రదాయిని అయిన పోలవరం ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి అందరి కలలను సాకారం చేయాలని ఆనాటి ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి తలచారు. ప్రాజెక్టు నిర్మాణం రూపుదిద్దుకునే లోపు కుడి, ఎడమ కాలువలను కూడా తవ్వించి నీటిని మళ్లించాలని పనులు ప్రారంభింపచేశారు. కుడి కాలువ పనులు ముందుకు సాగకుండా చేసే ఉద్దేశంతో ప్రతిపక్ష పార్టీకి చెందిన ఆయాప్రాంత నాయకులు, రైతులు ఎక్కడికక్కడ అడ్డంకులు సృష్టించారు. కోర్టులను ఆశ్రయించారు. భూములు ఇవ్వకుండా, కాలువ పనులను అడ్డుకోగలిగారు. కానీ భూ సమీకరణకు అంగీకరించి తమ భూములను అప్పగించిన ప్రాంతాలలో మాత్రం కాలువ తవ్వకం పనులను వైఎస్ రాజశేఖరరెడ్డి కొనసాగింపచేశారు. ఆ తర్వాత పట్టిసీమ పేరిట టీడీపీ సర్కారు చేపట్టిన ప్రాజెక్టుకు అదే రైతులు సహకరించి భూములు అప్పగించడంతో బిట్లు బిట్లుగా ఆగిపోయిన పోలవరం కుడి కాలువ పనులు పూర్తయ్యాయి. దీంతో నీటిని విడుదల చేయగలిగారు. ఇప్పుడు కూడా పోలవరం కాలువ పనులకు అడ్డంకులు సృష్టించిన రీతిలోనే విద్యుత్తు లైను నిర్మాణానికి మోకాలడ్డుతున్నారనేది తేటతెల్లం అవుతోంది.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



తాళ్లరేవు పంచాయతీలో చెత్తను శుభ్రం చేస్తున్న నాయకులు, అధికారులు



పేరూరులోని డ్రెయిన్‌లో పూడిక తొలగిస్తున్న డీపీవో కృష్ణకుమారి తదితరులు

అమలాపురం రూరల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని డీపీవో కృష్ణకుమారి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కామనగరువు, పేరూరు గ్రామాల్లోని డ్రెన్లలో పూడిక తొలగింపు పనులను చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీపీవో కృష్ణకుమారి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దాసరి అరుణ, నక్కా అరుణకుమారి పాల్గొన్నారు.

యానాం: స్థానిక ఒన్‌స్టాప్ సెంటర్ వద్ద శ్రమదాన్ ఫర్ స్వచ్ఛతా కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్, ఉమా చైల్డ్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు కలిసి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను సంయుక్తంగా తొలగించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్ఏఓ గణేషన్, సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీనివాస్, డాక్టర్ నరేష్, చింతపల్లి కృష్ణ సుధాకర్ పాల్గొన్నారు.

తాళ్లరేవు: జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఆదివారం గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. మండల కేంద్రమైన తాళ్లరేవులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చెత్తను శుభ్రం చేశారు. పంచాయతీ కార్యదర్శి నున్న శంకరనారాయణ పర్యవేక్షణలో స్వచ్ఛతా ర్యాలీ, పంచాయతీ కార్మికులకు సత్కారం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి, ఎంపీడీఓ ఎం.అనుపమ, ఈఓపీఆర్డీ ఎం.భైరవమూర్తి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ ఆకుల వెంకటేశ్వర్లు, నాయకులు చిట్టూరి చలపతి, నందికోళ్ల శ్రీమన్నారాయణ, రత్సా ముత్యాలు, కార్యదర్శి టి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది చీపురులు పట్టి శ్రమదానం చేసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. తొలుత స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ నిర్వహించి రోగులకు, ప్రజలకు పరిశుభ్రత–ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన శ్రమదానంలో వైద్యులతో పాటు నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లవరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని ఎంపీపీ ఇళ్ల శేష గిరిరావు అన్నారు. ఆదివారం కొమరగిరిపట్నంలో సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా చీపుర్లు చేత బట్టి పరిసరాలను శుభ్రం చేశారు. అల్లవరంలో సర్పంచ్ బొమ్ము బాలవేణి అధ్యక్షతన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బీఎస్ఎస్ కృష్ణమోహన్ చెత్త చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, మాకే కృష్ణమూర్తి, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, కార్యదర్శులు ఎన్వీవీ సత్యనారాయణ, రాజమోహన్, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, భీమనపల్లి, విలసవిల్లి, నంగవరం గ్రామాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. క్లీన్ విలేజ్–గ్రీన్ విలేజ్ అనే నినాదంతో గ్రామాల్లో ర్యాలీలను నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న చెత్తను శుభ్రం చేసి పరిసరాలను, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.

ప్రతిభ చాటిన విద్యార్థినులు

ఐ.పోలవరం: కాకినాడ డీఎస్పీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు ప్రతిభను చాటారని ఐ.పోలవరం జెడ్పీ పాఠశాల హెచ్ఎం వీధి సురేష్‌బాబు అన్నారు. విద్యార్థినులు కొమ్మన హాసినీ సత్యసుధ హ్యాండ్ బాల్‌లో, ఉద్దిశ యువశ్రీ సత్య అండర్–14 వాలీబాల్‌లో, అప్పాడి కల్యాణి అండర్–17 హ్యాండ్ బాల్‌లో రాణించారని చెప్పారు. విద్యార్థినులను స్థానిక సర్పంచ్ దంతులూరి రాఘవరాజు, సొసైటీ చైర్మన్ విత్తనాల శ్రీనివాసరావు, పీఎంసీ చైర్మన్ రేవు ధనలక్ష్మి, తహసీల్దార్ ఝాన్సీ లక్ష్మి, ఎంపీడీఓ డి.రాంబాబు, ఎంఈఓ కొండా రెడ్డి తదితరులు అభినందించారు.

ఎమ్మెల్సీ సంతాపం

అమలాపురం టౌన్: ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు ఉప కార్యదర్శి గుత్తుల గణేష్ మృతికి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు సంతాపం తెలిపారు. స్థానిక శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో హైస్కూలు సెంటరులో ఆదివారం జరిగిన సంతాప సభలో ఎమ్మెల్సీ సూర్యనారాయణ రావు పాల్గొని గణేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంతాప సభలో శెట్టిబలిజ సంఘాల నాయకులు కుడుపూడి త్రినాథ్, యనమదల కరుణాకర్, కడలి దుర్గాప్రసాద్, సంసాని నటరాజ్, గొవ్వాల గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ కిందపడి..

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో కోరంగి వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామానికి చెందిన పాలెపు సత్తిబాబు (45) మృతి చెందాడు. కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ కథనం ప్రకారం.. సత్తిబాబు బైక్‌పై కాకినాడ వైపునకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ప్రమాదవశాత్తూ తగలడంతో కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో సత్తిబాబు తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు హుటాహుటిన కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



















మల్లాడి సేవలు ఆదర్శనీయం

విశ్రాంత ఐఏఎస్ అధికారి జయప్రకాష్ నారాయణ, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



యానాం ఓల్డేజ్ హోమ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఐఏఎస్ అధికారి జయప్రకాష్ నారాయణ తదితరులు

యానాం: యానాం ఓల్డేజ్ హోమ్ ద్వారా మాజీ మంత్రి, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు గత 25 ఏళ్లుగా వృద్ధులు, అభాగ్య చిన్నారులకు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని మాజీ ఐఏఎస్ అధికారి జయప్రకాష్ నారాయణ, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణలు అన్నారు. ఆదివారం స్థానిక అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో యానాం ఓల్డేజ్ హోమ్ రజతోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఐఏఎస్ అధికారి జయప్రకాష్ నారాయణ, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకులు అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో అందించినపుడే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కుటుంబంలో వృద్ధులను ఆదరించాల్సిన బాధ్యత పిల్లలపై ఉందని, సమాజంలో ఓల్డేజ్ హోమ్‌ల అవసరమే లేని రోజులు రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఓల్డేజ్‌హోమ్ ద్వారా 25 ఏళ్లుగా చేపట్టిన కార్యక్రమాలను తెలిపే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాజీ ఐఏఎస్ అధికారి జయప్రకాష్ నారాయణ, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, ఐఆర్ఎస్ అధికారి వినయ్, గాయని శ్రీలేఖలను తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో కేంద్ర పీడబ్ల్యూడీ, కమర్షియల్ ట్యాక్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.అన్బరుసు, వైజాగ్ ప్రొఫైల్స్ చైర్మన్ డాక్టర్ ఇ.శంకరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిడ్ల చంద్రరావు, మాజీ వైస్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మరిడమ్మ అమ్మవారి తీర్థం

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామదేవత మరిడమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. అమ్మవారి జాతరను గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో నిర్వహించారు. అమ్మవారి తీర్థం సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆదివారం ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించుకున్నారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థాన పాలక మండలి సభ్యుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, కోరంగి సర్పంచ్ పెయ్యాల మంగేష్, స్థానిక ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా బాలయోగి జయంతి

ఐ.పోలవరం: లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి 72వ జయంతి సందర్భంగా మండలంలోని పాతయింజరంలో ఉన్న బాలయోగి నిలువెత్తు విగ్రహానికి మాజీ ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, చెల్లి వివేకానంద తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలయోగి కృషితోనే ఎదుర్లంక-యానాం వంతెన నిర్మాణం జరిగిందన్నారు.

ఎమ్మెల్యే పొన్నాడకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే పొన్నాడకు కృతజ్ఞతలు తెలుపుతున్న కొబ్బరి దింపు కార్మికులు, సంఘ నాయకులు

ముమ్మిడివరం: అసెంబ్లీ సమావేశాల్లో శెట్టిబలిజ కులవృత్తుల కార్మికులకు 50 ఏళ్లకే పింఛన్, జీవనభృతిని ఇవ్వాలంటూ సుదీర్ఘంగా మాట్లాడిన టీటీడీ బోర్డు సభ్యుడు, స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు కొబ్బరి దింపు కార్మికులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆదివారం ఎమ్మెల్యే నివాస గృహంలో ఏపీ రాష్ట్ర కొబ్బరి దింపు కార్మిక మహానాడు సంక్షేమ సంఘ అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు, సంఘ న్యాయవాది సత్తిరాజు ఆధ్వర్యంలో పలువురు సంఘ నాయకులు ఎమ్మెల్యేను కలిసి దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు.

